# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 29-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్రంలో వస్త్ర పరిశ్రమ అభివృద్ధిని వేగవంతం చేసేందుకు  కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించిన కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్.**

**2** **విద్యుత్ శాఖ సహా పలు అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

**3.** **రాష్ట్రంలోని నగరాలను  చెత్త డంపింగ్ యార్డు రహితంగా మార్చేలా  ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్న  మంత్రి పి.నారాయణ.**

**4.** **వర్షాల కారణంగా తలెత్తిన విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నవిద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్.**

==========================

రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కృష్ణా జిల్లాలోని మల్లవల్లి పారిశ్రామిక వాడను ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోని చేతివృత్తి కళాకారుల నైపుణ్యాలకు ప్రపంచ మార్కెట్లలో మరింత ప్రాధాన్యం లభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో వస్త్ర పరిశ్రమ అభివృద్ధిని వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం -పీఎల్ఐ  ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని నిధులు అందేలా కృషి చేస్తామని కేంద్రమంత్రి తెలియజేస్తూ

వాయిస్ 41 సెకెన్లు

అనంతరం ప్రధానమంత్రిగా  నరేంద్ర మోదీ 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అంశంపై ఆయన మాట్లాడుతూ,  సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ అనే సూత్రాల ఆధారంగా, ప్రజల అభ్యున్నతి కోసం ప్రధానమంత్రి అనేక ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు.

--------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో తొలుత విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహిస్తున్నారు. విద్యుత్ సరఫరా పరిస్థితులు, వర్షాల నేపథ్యంలో తలెత్తిన సమస్యలు, విద్యుత్ పునరుద్ధరణ చర్యలపై అధికారులతో

చర్చిస్తున్నారు. అనంతరం సైబర్ నేరాల కార్యాచరణ ప్రణాళికపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారని అధికారులు తెలిపారు. అలాగే పోర్టుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలపై కూడా ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించనున్నారు. అదేవిధంగా రాష్ట్ర రవాణా వ్యవస్థ బలోపేతానికి సంబంధించి ఆర్టీసీ బస్సుల కొనుగోలు ప్రక్రియపై అధికారులతో సమావేశమై పురోగతిని తెలుసుకోనున్నారని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని నగరాలను చెత్త డంపింగ్ యార్డు రహితంగా మార్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని కొండపల్లిలో ఈరోజు పర్యటించిన మంత్రి, అక్కడ నిర్మాణంలో ఉన్న వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం విశాఖపట్నం, గుంటూరులో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు పనిచేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో 107 ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని, వీటి ద్వారా ప్రతిరోజూ 5 వేల 385 టన్నుల చెత్తను బయోగ్యాస్‌గా మారుస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 31 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో కురిసిన వర్షాలు, ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల తలెత్తిన విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. విద్యుత్ సమస్యలపై మంత్రి అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి కృష్ణా, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని చెప్పారు. భారీ వర్షాల కారణంగా కొన్నిచోట్ల విద్యుత్ పునరుద్ధరణ పనులు ఆలస్యమవుతున్నాయని వెల్లడించారు. అలాగే ప్రజలు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తత సందేశాలు పంపాలని అధికారులకు తెలిపారు. ప్రజలకు ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా 1912 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని మంత్రి సూచించారు.

---------------------------

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈరోజు పలు అంశాలపై మాట్లాడారు. జూన్ ఒకటో తేదీ నుంచి విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అలాగే జులై నెలలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, వీటిలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర- 2026 పేరుతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే నెల 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 14 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ప్రచారాలు నిర్వహించి, జూన్ 21వ తేదీన అమరావతిలో 25 వేల మందితో రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఒక్కో జిల్లాలో ప్రత్యేకంగా యోగాంధ్ర నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఎన్టీఆర్ జిల్లాలో పోలీసులతో, తూర్పుగోదావరి జిల్లాలో ఖైదీలతో.. ఇలా 28 జిల్లాలకు 28 ప్రత్యేక

ఇతివృత్తాలను ఖరారు చేసింది. ప్రతి జిల్లా కేంద్రంలో వెయ్యి మంది చొప్పున పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తోంది

---------------------------

గత 12 సంవత్సరాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రజాహిత పరిపాలన అందిస్తూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకున్నామని శ్రీకాకుళం జిల్లాకు చెందిన లబ్ధిదారులు తెలిపారు. పీఎం కిసాన్ యోజన ద్వారా అందించే నగదు సహాయం పంటల సాగుకు ఎంతో ఉపయోగపడుతుందని శ్రీకాకుళానికి చెందిన వై. భుజంగ రావు తెలిపారు.

వాయిస్ 35 సెకన్లు

"మేక్ ఇన్ ఇండియా", "ఆపరేషన్ సిందూర్" వంటి కార్యక్రమాల ద్వారా దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పీ జీ గుప్తా తెలిపారు.

వాయిస్ 25 సెకన్లు

---------------------------

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు కాలానుగుణ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అనంతపురం జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ ఓబులు సూచించారు. అనంతపురంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ, నివాస ప్రాంతాల్లో నిల్వ నీరు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రత పాటించాలని తెలిపారు. దోమల నివారణ కోసం ప్రభుత్వం "ఫ్రైడే డ్రైడే" వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. నీటి నిల్వ లేకుండా, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

---------------------------

అంతర్జాతీయ శాంతి పరిరక్షకుల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ పలు దేశాల్లో రక్షణ, సౌభాతృత్వాన్ని కాపాడేందుకు ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళం కృషిచేస్తున్న నేపధ్యంలో వారి సేవలను గుర్తించేందుకు ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా మే 29వ తేదీన అంతర్జాతీయ శాంతి పరిరక్షకుల దినోత్సవంగా పాటిస్తోంది.

=====================